# సాక్షి విశాఖపట్నం

బుధవారం । 13 । మార్చి । 2024






కళాత్మక గోడలు.. పర్యావరణ పాఠాలు 8లో



**గీతాంజలి మృతి బాధాకరం**

మహిళలపై అసభ్యకరంగా ట్రోల్ చేస్తున్న వాళ్ల తోలు తీయాలని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. 8లో

**నేటి నుంచి డయల్ యువర్ కలెక్టర్**



డయల్ యువర్ కలెక్టర్- ఓటరు హెల్ప్ లైన్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహించనున్నారు. 8లో

## న్యూస్‌రీల్

### వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అమర్‌నాథ్ గతంలో ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పరిశ్రమల శాఖ మంత్రిగా, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. గాజువాక నియోజకవర్గంతో ఆయన కుటుంబానికి వీడదీయరాని అనుబంధం ఉంది. వారు ఉంటున్న మింది ప్రాంతం కూడా గాజువాక నియోజకవర్గంలోనే ఉంది. ఇక్కడ బంధుగణంతోపాటు కాపు సామాజిక వర్గం, ఆయన తండ్రి గుడివాడ గురునాథరావు అభిమానులు ఎక్కువగా ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం.

### నవరత్నాల విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ



డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ లజపతిరాయ్ రూపొందించిన నవరత్నాల విజన్ డాక్యుమెంట్‌ను రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల కలిగిన ఉపయోగాలను వివరిస్తూ రూపొందించిన డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని వై.వి.సుబ్బారెడ్డి కొనియాడారు. సిరిపురంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ చేరుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్‌పంత్

గోపాలపట్నం : ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు 12 మంది మంగళవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ నెల 31న చెన్నైతోను, ఏప్రిల్ 2న కోల్‌కత్తా నైట్ రైడర్స్‌తో తలపడుతోంది. విశాఖ వాతావరణానికి అలవాటు పడడంతోపాటు ఇక్కడ ప్రాక్టీస్ చేసేందుకు ముందుగా వచ్చారు.

### దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ



దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు, వీల్ చైర్లు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీఎల్) సహకారంతో దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాలు, వీల్ చైర్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పంపిణీ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఐఓసీఎల్ సిబ్బందితో కలిసి సుమారు రూ.42 లక్షల విలువైన 50 మోటరైజ్డ్ వాహనాలు, 200 వీల్ చైర్లు అందజేశారు. గత ఐదు నెలల్లో ఐఓసీఎల్ సహకారంతో సుమారు కోటి రూపాయల సీఎస్ఆర్ నిధులతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఇంటింటికి గ్యాస్ సరఫరా అతి త్వరలోనే జరుగుతోందని ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంస్థ సహాయ సంచాలకులు మాధవి, ఐఓసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.సుధాకర్, జనరల్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్ సీపీ

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భీమిలి, గాజువాక, పెందుర్తి, విశాఖ దక్షిణ, ఉత్తర, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేవా కార్యక్రమాలు చేపట్టారు.



విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు



సబ్బవరంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



35వ వార్డులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు



వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



భీమిలిలోని క్యాంప్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు



విశాఖ తూర్పు: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ

## సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి

**ఎమ్మెల్సీ కుంభా రవిబాబు**

కొమ్మాది: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి.. రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పాలనలో విద్య, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు వచ్చాయన్నారు. ఈ 13 ఏళ్లలో వైఎస్సార్‌సీపీ దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ పథకాన్ని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రవిబాబు పిలుపునిచ్చారు.

జిల్లా సేవాదల్ అధ్యక్షుడు దాడి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ కార్యాలయ పరిశీలకుడు జి.రవిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అనూష, పేర్ల విజయ్ చందర్, రాష్ట్ర అనుబంధ విభాగం ఉపాధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవత్సవ, పేడాడ రమణికుమారి, ఐహెచ్ ఫరూఖీ, వంకాయల మారుతీప్రసాద్, అల్లంపల్లి రాజబాబు, జానకీరావు, శశికళ, కృపాజ్యోతి, బోని శివరామకృష్ణ, అప్పన్న, నమ్మి లక్ష్మణరావు, బయ్యవరపు రాధ, కోరాడ అప్పలస్వామి, వనపల్లి ఈశ్వరరావు, పిల్ల సుజాత సత్యనారాయణ, జగ్గుపల్లి అప్పలరాజు, రామన్న పాత్రుడు, ముదుండు రాజేశ్వరి, దాసరి రమేష్, మధు సంపతి, జగ్గుపల్లి నరేష్, బి.జగదీష్, గొలగాని లక్ష్మి, రెడ్డి, రాజుకుమారి, ఆశాజ్యోతి, సువ్వాడ శ్రీదేవి, మోహన్‌రావు, శరత్‌చంద్ర, నల్ల రవికుమార్, గొలగాని రాము, జీరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

## వంశీపై 'సీత' కన్ను



భీమిలి టికెట్ వస్తుందని ఆశపడ్డాడు. అది కాకపోతే విశాఖ దక్షిణ సీటు గ్యారంటీ అని ధీమాగా ఉన్నాడు. ఈ సమయంలో ఎమ్మెల్సీ పదవిపై అనర్హత వేటు పడింది. తాజాగా వస్తుందనుకున్న సీటుపై మరో నేత పేరు తెరపైకి వచ్చింది. దీంతో ఎమ్మెల్సీ పదవి పాయే.. ఎమ్మెల్యే టికెట్ పాయే అన్నట్లుగా తయారైంది వంశీకృష్ణ శ్రీనివాస్ పరిస్థితి.

- దక్షిణ జనసేనలో అలజడి
- సీటు ఖరారైందన్న ధీమాతో వంశీకృష్ణ శ్రీనివాస్
- తెరపైకి సీతంరాజు సుధాకర్ పేరు
- సీతంరాజుకే టికెట్ ఇవ్వాలని జనసైనికుల ప్రెస్‌మీట్‌తో వంశీకి ఝలక్
- టెన్షన్‌లో వంశీకృష్ణ.. ఎమ్మెల్సీ పదవి పాయే.. సీటైనా దక్కుతుందా?

**గోరు చుట్టుపై రోకలిబండ**

వంశీకృష్ణ పరిస్థితి గోరు చుట్టుపై రోకలి బండ పడినట్లుగా తయారైంది. వైఎస్సార్ సీపీ ఒకవైపు పార్టీ పదవులతో పాటు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావించి పార్టీకి రాజీనామా చేసేసి జనసేనలో చేరిపోయాడు. దీంతో ఎమ్మెల్సీ పదవిపై అనర్హత పడింది. కనీసం విశాఖ దక్షిణ టికెట్ సాధించి ఎన్నికల బరిలో దిగాలని భావించినప్పటికీ.. సీతంరాజు అడ్డంగా రావడంతో వంశీలో టెన్షన్ మొదలైంది.

విశాఖ సిటీ : విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేనలో అలజడి రేగుతోంది. ఈ స్థానంపై వంశీకృష్ణ శ్రీనివాస్ కొండంత ఆశలు పెట్టుకుంటే.. ఇదే సీటుపై తాజాగా సీతంరాజు సుధాకర్ కన్ను పడింది. వంశీ స్థానానికి ఎసరు పెట్టేందుకు పావులు కదుపుతుండడం ఇప్పుడు జనసేన పార్టీలోనే హాట్ టాపిక్‌గా మారింది.

**పాపం వంశీ..**

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన పార్టీలో ఇటీవలే చేరాడు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నాడు. అదే సమయంలో భీమిలి టికెట్ ఇస్తానని స్వయంగా పవన్ కల్యాణ్ హామీ ఇవ్వడంతో పాటు నగర అధ్యక్షుడిగా నియమించాడు. వెంటనే వంశీకృష్ణ శ్రీనివాస్ భీమిలి నియోజకవర్గం నాయకులతో వరుస భేటీలు నిర్వహించి కొద్ది రోజులు హడావుడి చేశాడు. ఇంతలో భీమిలి స్థానం జనసేనకు కేటాయించడం లేదన్న సంకేతాలు వచ్చాయి. దీంతో వంశీ రాజకీయ భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. మళ్లీ అధినేత పవన్‌ను కలిశాడు. ఈసారి విశాఖ దక్షిణ టికెట్ హామీ లభించింది. ఇటీవల దక్షిణ జనసేన నేతలతో సమావేశాలు నిర్వహించాడు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాడు. ఇంతలో మరో పిడుగులాంటి వార్త ఆయనకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

**తెరపైకి సీతంరాజు**

విశాఖ దక్షిణ టికెట్ ఖరారైందని ధీమాతో ఉన్న సమయంలో తాజాగా సీతంరాజు సుధాకర్ పేరు తెరపైకి వచ్చింది. వైఎస్సార్ సీపీలో టికెట్ ఆశించి భంగపడి బయటకు వెళ్లిపోయిన సీతంరాజు ప్రస్తుతం ఏ పార్టీలోను చేరలేదు. వైఎస్సార్ సీపీకి రాజీనామా చేయకముందే సీతంరాజు సుధాకర్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో రహస్యంగా భేటీ అయి దక్షిణ టికెట్ కావాలని కోరాడు. అయితే చంద్రబాబు నుంచి హామీ లభించకపోవడంతో ఆయన టీడీపీలో చేరలేదు. ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ఏ పార్టీకి దక్షిణ స్థానం వస్తే ఆ పార్టీలో జంప్ చేయడానికి సీతంరాజు సుధాకర్ సిద్ధంగా ఉన్నాడు. తాజా పరిణామాల నేపథ్యంలో విశాఖ దక్షిణ సీటును జనసేనకు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సీతంరాజు జనసేనలో వాలిపోడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ఒకవైపు చంద్రబాబు ద్వారా పవన్ కల్యాణ్‌పై ఒత్తిడి తీసుకువచ్చి జనసేన సీటు కొట్టేసే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. జనసేన కూడా సీతంరాజు సుధాకర్ పేరును పరిశీలిస్తున్నట్లు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

**జనసైనికుల ఝలక్**

సీతంరాజు సుధాకర్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుసుకున్న వంశీకృష్ణ పార్టీ అధినాయకత్వంతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. వారి నుంచి హామీ తీసుకొనే పనిలో ఉన్న సమయంలో.. స్థానిక జనసైనికులు వంశీకి ఝలక్ ఇచ్చారు. విశాఖ దక్షిణ టికెట్‌ను సీతంరాజు సుధాకర్‌కే ఇవ్వాలని మంగళవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ డిమాండ్ చేశారు. వేరే ఎవరికి ఇచ్చినా సహకరించమని తెగేసి చెప్పారు. జనసైనికుల స్టేట్‌మెంట్‌తో వంశీకృష్ణలో వణుకు మొదలైంది. అధినాయత్వం నుంచి టికెట్ దక్కించుకున్నా.. స్థానిక నాయకులు, అభిమానులు సహకరించకపోతే పరిస్థితి ఏంటన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాడు. అసలు పార్టీలో చేరకుండానే సీతంరాజు సుధాకర్ చేస్తున్న రాజకీయం పట్ల వంశీ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాడు. ఈ విషయాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వద్దే తేల్చుకోవాలని సంసిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా వంశీ పరిస్థితి ఎమ్మెల్సీ సీటు పాయే.. వస్తుందనుకున్న విశాఖ దక్షిణ టికెట్ కూడా పాయే అన్నట్లు ఉంది.

## 20 మంది సీఐలకు మెమోలు..!

- రౌడీషీటర్ల కౌన్సెలింగ్ ప్రక్రియలో సీఐల నిర్లక్ష్యం
- ఆదివారం నాటి కౌన్సెలింగ్‌కు సగం మంది డుమ్మా
- జిల్లాలో 633 మంది రౌడీషీటర్లు ఉంటే.. 334 మందే హాజరు
- సీపీ రవిశంకర్ సీరియస్
- పెదగంట్యాడ, హార్బర్ మినహా అన్ని స్టేషన్ల సీఐలకు మెమోల జారీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మెమోల వ్యవహారం పోలీస్ శాఖలో చర్చనీయాంశమవుతోంది. నగరంలో 22 పోలీస్‌స్టేషన్లు ఉంటే.. అందులో 20 మంది సీఐలకు మెమోలు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని జాయింట్ సీపీ ఫకీరప్ప ఆదేశాలు జారీ చేస్తే.. సగం మంది కూడా హాజరుకాలేదు. పద్మనాభం, హార్బర్ మినహా మిగిలిన అన్ని స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు పోలీసుల కౌన్సెలింగ్‌ను లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. దీంతో ఈ వ్యవహారంపై పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

**ఎన్నికలు సమీపిస్తున్న వేళ :** ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేపట్టాలని జాయింట్ సీపీ ఫకీరప్ప ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. దీంతో అన్ని స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు సీఐలు గత ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు.

**సగం మంది డుమ్మా :** కమిషనరేట్ పరిధిలో మొత్తం 633 మంది రౌడీషీటర్లు ఉన్నారు. అయితే కౌన్సెలింగ్‌కు కేవలం 334 మంది మాత్రమే హాజరయ్యారు. సగం మంది రౌడీషీటర్లు ఈ కౌన్సెలింగ్‌ను సీరియస్‌గా తీసుకోకుండా డుమ్మా కొట్టారు. జోన్-1 పద్మనాభం స్టేషన్ పరిధిలో 7 మంది రౌడీషీటర్లు ఉంటే అందరూ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అలాగే జోన్-2 హార్బర్ స్టేషన్ ఉన్న ఒక రౌడీషీటర్ జైలులో ఉన్నాడు. మిగిలిన అన్ని స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు అత్యధికంగా గైర్హాజరయ్యారు. వన్‌టౌన్‌లో 49 మంది రౌడీషీటర్లు ఉండగా.. 17 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే మహారాణిపేట స్టేషన్ పరిధిలో 22 మందికి 8, ఎంవీపీలో 35 మందికి 9, ఫోర్త్ టౌన్‌లో 37 మందికి 16, న్యూపోర్ట్ 31 మందికి 10, గాజువాకలో 45 మందికి 17, దువ్వాడలో 22 మందికి 9, పెందుర్తిలో 46 మందికి 22 మంది.. ఇలా అన్ని స్టేషన్ల పరిధిలో ఇదే తరహాలో రౌడీషీటర్లు హాజరయ్యారు. ఈ సంఖ్యను తెలుసుకున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ విస్తుపోయారు. రౌడీషీటర్లను కౌన్సెలింగ్‌కు తీసుకురాలేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇందుకోసం అత్యల్ప సంఖ్యలో రౌడీషీటర్లు జైలులో ఉండగా.. కొద్ది మంది ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో హాజరుకాలేకపోయినట్లు తెలుస్తోంది. అయితే అత్యధిక శాతం పోలీసుల కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోవడం సీఐల నిర్లక్ష్యంగా సీపీ సీరియస్‌గా పరిగణించారు. సీఐలకు మెమోలు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. 20 స్టేషన్ల సీఐలకు డీసీపీ-1 మణికంఠ, డీసీపీ-2 సత్తిబాబు మెమోలు జారీ చేశారు.

| స్టేషన్ | రౌడీషీటర్లు | హాజరైనది | | | |
|---|---|---|---|---|---|
| వన్‌టౌన్ | 49 | 17 | భీమిలి | 27 | 18 |
| టూ టౌన్ | 30 | 17 | ఆనందపురం | 24 | 12 |
| త్రీ టౌన్ | 20 | 13 | పద్మనాభం | 7 | 7 |
| ఫోర్త్ టౌన్ | 37 | 16 | మల్కాపురం | 20 | 16 |
| కంచరపాలెం | 65 | 40 | న్యూపోర్ట్ | 31 | 10 |
| హార్బర్ | 1 | 0 | గాజువాక | 45 | 17 |
| మహారాణిపేట | 22 | 8 | దువ్వాడ | 22 | 9 |
| ద్వారకా | 11 | 10 | స్టీల్‌ప్లాంట్ | 0 | 0 |
| ఎంవీపీ | 35 | 9 | ఎయిర్‌పోర్ట్ | 25 | 17 |
| ఆరిలోవ | 46 | 27 | గోపాలపట్నం | 20 | 13 |
| పీఎం పాలెం | 50 | 36 | పెందుర్తి | 46 | 22 |

## కదిలాయ్ వందేభారత్ చక్రాల్

విశాఖ సిటీ: ఆకర్షణీయమైన ఆకారం.. విలావంతమైన సౌకర్యం.. అత్యధిక వేగం.. సుదూర ప్రాంతాలకు అత్యంత వేగంగా చేసుకొనే అత్యధిక వేగంతో ప్రయాణించే వందే భారత్ రైళ్లు విశాఖ పట్టాలపై పరుగులు పెట్టాయి. ఇప్పటివరకు ఉన్న ఒకటి కాస్తా ఉదయానికి రెండు కాగా.. సాయంత్రానికి మూడు రైళ్లు విశాఖ కేంద్రంగా ప్రయాణికులకు సౌకర్యవంతమైన రైలు ప్రయాణాన్ని అందించడానికి అందుబాటులోకి వచ్చాయి. విశాఖలో వందే భారత్ రైలు ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారీ జనసందోహం.. పిల్లల కేరింతలు.. యూట్యూబర్ల షూటింగ్‌ల హడావుడి మధ్య విశాఖపట్నం–భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం విశాఖ



వందేభారత్ రైల్లో కేవీ వాల్తేర్ విద్యార్థులు

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు ఈ రైలు విశేషాలు, సౌకర్యాలు విద్యార్థులకు, యూట్యూబర్లకు వివరిస్తూ పలాస వరకు తీసుకువెళ్లారు. రైలులోనే స్టార్ హోటల్ తరహా ఆహారాన్ని అందజేశారు. రైలు వేగం.. అందులో సౌకర్యాలను చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారు. అలాగే రాత్రి సికింద్రాబాద్ నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు మరో వందే భారత్ రైలు చేరుకుంది. దీనికి కూడా రైల్వే అధికారులు



విశాఖ నుంచి బయలుదేరుతున్న వందేభారత్

మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ రైలు సందర్శించేందుకు ఇతర రైలు ప్రయాణికులు సైతం పోటీ పడ్డారు.

**కేవీ వాల్తేర్ విద్యార్థుల సందడి**

కంచరపాలెం: విశాఖ –భువనేశ్వర్ మధ్య ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లో తాటిచెట్లపాలెం వాల్తేర్ కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు మంగళవారం సందడి చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవకాశం కల్పించిన వాల్తేర్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ కమల్‌జిత్ కృతజ్ఞతలు తెలిపారు.

## చిరుతపులి చర్మం అక్రమ రవాణా

- స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ అధికారులు
- నలుగురు అరెస్ట్

విశాఖ సిటీ: చిరుతపులిని వేటాడి దాని చర్మాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు మంగళవారం విశాఖలో చెక్ పెట్టారు. వివరాల్లోకి వెళితే.. చిరుతపులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు విశ్వసనీయవర్గాల సమాచారంతో విశాఖలో నిఘా పెట్టారు. నగరంలో ఒక



డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మం

హోటల్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద చిరుతపలి చర్మాన్ని గుర్తించారు. చిరుతపులిని వేటాడి దాని చర్మాన్ని విక్రయించడానికి విశాఖ మీదుగా తరలించడానికి ప్రయత్నిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఆ ముగ్గురుతో పాటు మరో వ్యక్తి కూడా ఇందులో కీలక పాత్ర ఉందని అధికారులు తెలుసుకున్నారు. వారి సమాచారంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ముఠా వినియోగించిన కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చిరుత చర్మంతో పాటు వన్యప్రాణి చట్టం 1972లోని నిబంధనల ప్రకారం తదుపరి విచారణ కోసం నలుగురిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అధికారులకు అప్పగించారు.

## క్లుప్తంగా

### బీచ్‌రోడ్డులో ఐకాన్ స్టార్ సందడి


అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

కొమ్మాది: ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ మంగళవారం బీచ్ రోడ్డులో సందడి చేశారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఫిషింగ్ హార్బర్ వద్ద గల ఓ కంటైనర్‌లో చిత్రీకరిస్తున్నారు. షూటింగ్‌లో పాల్గొంటున్న ఆయన నగరంలోని ఓ రిసార్ట్‌లో ఉంటున్నారు.

### నేటితో ముగియనున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ

మహారాణిపేట: జిల్లాలో ఖరీఫ్ 2023–24 సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ బుధవారంతో ముగుస్తుందని జేసీ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గతంలో మార్చి 2 వరకు గడువు ఇచ్చినప్పటికీ, ఇంకా రైతుల వద్ద మిగిలిన ధాన్యం సేకరణ కోసం 13వ తేదీ వరకు గడువు పెంచినట్లు చెప్పారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### మహిళా ఉద్యోగిని వేధించిన అధికారి

**మత్స్యశాఖ జేడీపై కేసు నమోదు**

డాబాగార్డెన్స్: అతనో ప్రభుత్వ అధికారి. కింది స్థాయి మహిళా ఉద్యోగులను లోబరుచుకోవడమే అతని పని. ఆ అధికారి చేస్తున్న వికృత చేష్టలకు కొంత మంది మహిళా ఉద్యోగులు బయటకు చెప్పేందుకు భయపడ్డారు. ఆ అధికారి ఇటీవల బదిలీపై వైజాగ్ వచ్చాడు. పాపం పండింది. వేధింపులు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. మచిలీపట్నం నుంచి బదిలీపై వచ్చిన షేక్ లాల్ అహ్మద్ విశాఖ ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్‌గా విధుల్లో చేరారు. ఇదే విభాగంలో వివిధ ప్రాంతాల్లో పని చేసిన ఆయన తన కింది స్థాయి మహిళా ఉద్యోగులను లోబరుచుకునేందుకు పలుమార్లు యత్నించారు. అధికారి హోదాలో ఉన్న అతనికి భయపడి మహిళా ఉద్యోగులెవరూ బయట చెప్పేందుకు సాహసించలేకపోయారు. అయితే విశాఖలో ఆయన పాపం పడింది. ఇదే విభాగంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను లోబరుచుకునేందుకు అతను యత్నించగా.. ఆమె ప్రతిఘటించింది. ఆ అధికారి బాగోతాన్ని వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో పోలీసులు అతనిపై మహిళా వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# నా విశాఖ.. నా కల

- ఆకట్టుకున్న ఏడేళ్ల చిన్నారి ప్రసంగం
- విజయవంతమైన 'విజన్ విశాఖ'



'నా కలల నగరం విశాఖ.. పూర్తిస్థాయిలో స్మార్ట్ సిటీగా మారాలి. విద్య కోసం ఇతర ప్రాంతాలు, దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో విశ్వ విద్యాలయాలు రావాలి. ఏయూను రోల్‌మోడల్‌గా తీసుకుని విద్యా సంస్థలు ఎదగాలి. వైద్య రంగంలో మరిన్ని వసతులు సమకూరాలి. ఇజ్రాయిల్‌కు దీటుగా పరిశోధన రంగంలో ప్రగతి సాధించాలి. పూర్తిస్థాయి సాంకేతికతో సేవలందించే విశ్వ నగరంగా రూపాంతరం చెందాలి. సెల్‌ఫోన్, వాలెట్ లేకుండా బయటకు వెళ్లినా మన పనులు మనం చేసుకుని వచ్చే విధంగా టెక్నాలజీ అభివృద్ధి చెందాలి. విశాఖ పేరు చెబితే బీచ్ గుర్తుకొస్తుంది. తీర ప్రాంతంలో స్వదేశీ, విదేశీయులను ఆకట్టుకునే నిర్మాణాలు జరగాలి. ఇక్కడ ప్రకృతి అందాలను తిలకించే విదేశీయులు ఇక్కడే స్థిరపడేలా వసతులు సమకూరాలి' అంటూ విశాఖపై తనకున్న విజన్‌ను ఏడేళ్ల చిన్నారి వివరించి తీరు అందరినీ ఆలోచింపజేసింది.

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం కన్వెన్షన్ సెంటర్ వేదికగా మంగళవారం నిర్వహించిన విజన్ విశాఖ సదస్సు విజయవంతమైంది. విశాఖ యువత నుంచి ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. అంతర్జాతీయంగా విశాఖ ఎదగడానికి అనువైన పరిస్థితులు, వసతులున్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. విశాఖ సామర్థ్యాలను వివరిస్తూ యువత తమ ఆలోచనలను పంచుకుంది. ఏడేళ్ల చిన్నారి తపస్వి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఏయూ న్యాయ కళాశాల విద్యార్థిని డి.హర్షిత మాట్లాడుతూ విలియం షేక్స్పియర్ జీవించి ఉంటే తన రచనల్లో వెనిస్ నగరం కంటే విశాఖ నగరాన్నే అధికంగా ప్రస్తావించి ఉండేవారన్నారు. విశాఖలో ప్రకృతి రమణీయత ఎంతో ప్రత్యేకమన్నారు. ప్రపంచానికే పవర్ జనరేటర్‌గా విశాఖ నిలుస్తుందన్నారు. వై నాట్ వైజాగ్ అనే స్థాయికి విశాఖ నేడు ఎదిగిందన్నారు. ఇది నా నగరం.. ఇదీ విశాఖ నగరం.. మన కథను మనమే రాద్దామంటూ తన ఉత్సాహభరిత ప్రసంగంతో యువతను ఆకట్టుకుంది.

సదస్సులో నిపుణుల ప్రసంగాలతో పాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సస్టైనబుల్ అర్బనైజేషన్, ఎంటర్‌ప్ర్యూనర్‌షిప్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అంశాలపై నిర్వహించిన మూడు చర్చాగోష్టులలో నిపుణులు, యువత విశాఖ నగరంపై తమ అంచనాలు, ఆకాంక్షలు, అవకాశాలను వివరించారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు, ప్రిన్సిపాల్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు ఆంజనేయ వర్మ, విశాఖపట్నం ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్, ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహన్ రామనాథన్, తారమండల్ వ్యవస్థాపకుడు విసీల్ జడ్సన్ తదితరులు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ భవిష్యత్‌కి బాటలు వేసే నగరంగా విశాఖ నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.


మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

# కళాత్మక గోడలు.. పర్యావరణ పాఠాలు

- పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ మరో వినూత్న కార్యక్రమం
- 'పెయింట్ మై స్ట్రీట్ చాలెంజ్'కు శ్రీకారం

డాబాగార్డెన్స్: ఎకో–వైజాగ్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జీవీఎంసీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ వార్డులో 'పెయింట్ మై స్ట్రీట్ చాలెంజ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు మంగళవారం సిరిపురం జంక్షన్‌లోని ఆలిండియా రేడియో స్టేషన్ సమీపంలో 'పెయింట్ మై స్ట్రీట్ చాలెంజ్' కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో–క్లీన్, ఎకో–గ్రీన్, ఎకో–బ్లూ, ఎకో–జీరో ప్లాస్టిక్, ఎకో–జీరో పొల్యూషన్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రేంజర్ ఫోర్స్ ఎన్జీవో సౌజన్యంతో, ఫ్లూయెంట్ గ్రిడ్ సహకారంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. తొలి విడతగా 2,500 చదరపు అడుగుల గోడపై సందేశాత్మక చిత్రాలతో చాలెంజ్ ప్రారంభించామన్నారు. ప్రతీ వార్డులో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దశలవారీగా జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే ఉత్సాహవంతులు సచివాలయాల్లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా.. ఈ చాలెంజ్‌లో 200 మంది వరకు స్వచ్ఛందంగా పాల్గొనగా.. వీరికి ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు మెంటర్లుగా వ్యవహరించారు. చిత్రాలు వేసిన కళాకారులతో అదనపు కమిషనర్ మాట్లాడి.. అందులో ఉన్న సందేశాలను అడిగి తెలుసుకున్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోన్–4 జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.లక్ష్మి, యూఎన్‌డీపీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస రాజామణి, ఫ్లూయెంట్ గ్రిడ్ ఉపాధ్యక్షుడు విన్సన్ ఎస్.కె.ఆడమ్స్, రవికాంత్‌రెడ్డి, రేంజర్ ఫోర్స్ ఎన్జీవో వ్యవస్థాపకుడు ఎస్.నాగేంద్రబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


గోడలపై అద్భుత చిత్రాలు గీస్తున్న చిన్నారులు


ఎకో–వైజాగ్ చిత్రాన్ని తిలకిస్తున్న అదనపు కమిషనర్లు


బొమ్మలు వేస్తున్న విద్యార్థులు



# సీఎం జగన్ వల్లే మహిళా సాధికారత


మహిళ గ్రూపు సభ్యులకు డివిడెండ్లు అందిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి


పాల్గొన్న మహిళలు

**ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి**

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే మహిళా సాధికారత సాధ్యమైందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో చైతన్య స్రవంతి, గృహలక్ష్మి సంస్థలు సంయుక్తంగా మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ 50 శాతం రాజకీయ, నామినేటెడ్ పోస్టులను మహిళలకు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన ప్రతీ పథకంలోనూ మహిళలకు ప్రాధాన్యమిస్తూ.. వారి ఆర్థికాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. స్వయం సహాయక గ్రూపుల కోసం మహిళా బ్యాంకు ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. చైతన్య స్రవంతి, గృహలక్ష్మి సంస్థలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రెండు సంస్థలు ఏడాదికి రెండున్నర కోట్ల టర్నోవర్ సాధించడం గొప్ప విషయమన్నారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖను కోల్‌కతా, ముంబయికి దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళ గ్రూపులకు డివిడెండ్లు అందజేశారు ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రెహమాన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు లజపతిరాయ్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్, కార్యదర్శి అశోక్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పేదల సొంతింటి కల సాకారం

- రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి
- 3,984 టిడ్కో ఇళ్లు ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం సమీపంలోని అచ్చినాయుడుతోట కొండ ప్రాంతంలో నిర్మించిన 3,984 టిడ్కో ఇళ్ల సముదాయాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా.. తొలుత లబ్ధిదారులు సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు నూతన వస్త్రాలు, ఇంటి తాళాలు అందించారు. స్వయంగా భోజనాలు వడ్డించి మాట్లాడారు. టిడ్కో ఇళ్ల ద్వారా పట్టణ పేదల సొంతింటి కల సాకారమైందని.. పేదల ఆకాంక్షలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన నిరుపేదలకు ఇళ్లు అందించడమే కాకుండా రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా ప్రభుత్వమే భరించిందని వెల్లడించారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారుల మోములో చిరునవ్వులు విరాజిల్లుతున్నాయని, ఈ నవ్వుల వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అప్పుడే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. టిడ్కో ప్రాజెక్ట్ చైర్మన్ ప్రసన్నకుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ బాపినాయుడు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


గృహ సముదాయాలను ప్రారంభిస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి, సమన్వయకర్త ఆనంద్‌కుమార్

## బయోమెట్రిక్‌పై 28 మందితో కమిటీ

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తలపెట్టిన బయోమెట్రిక్ అటెండెన్స్‌పై యాజమాన్యం 28 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బయోమెట్రిక్ అమలుకు కార్మిక సంఘాలు నిరాకరించి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చాయి. దీంతో బయోమెట్రిక్ అమలుతో తలెత్తే సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కమిటీ ఏర్పాటుకు అంగీకరించింది. ఈ కమిటీలో యాజమాన్యం నుంచి ఆరుగురు ప్రతినిధులు కాగా మిగిలిన 22 మంది కార్మిక సంఘాలకు చెందినవారు. ఈ కమిటీ మంగళవారం మధ్యాహ్నం తొలి సమావేశం నిర్వహించింది. రెండు నెలల్లోగా కమిటీ తమ నివేదికను సమర్పించనుంది.

## తలనీలాల వేలం వాయిదా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఏడాదిపాటు భక్తులు సమర్పించిన తలనీలాలు విక్రయానికి మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. పశ్చిమగోదావరికి చెందిన పలు హెయిర్ ఇండస్ట్రీస్ సంస్థలు వేలం పాటలో పాల్గొన్నాయి. గతేడాది రూ.10.76 కోట్లకు తలనీలాల వేలం పాట వెళ్లింది. ఈ ఏడాది తలనీలాలకు గిరాకీ లేదంటూ పాటదారులు ఆసక్తి కనబర్చలేదు. దీంతో రూ.6.10 కోట్ల వద్ద హెచ్చుపాట నిలిచింది. దీంతో ఈవో వేలం పాటను వాయిదా వేశారు.

# 30 మంది ఎంపీడీవోలకు చార్జ్‌మెమోలు

- 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో ఖర్చు చేయని వైనం
- స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై చర్చ

మహారాణిపేట : 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సకాలంలో ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వని 30 మంది ఎంపీడీవోలకు చార్జ్‌మెమోలు జారీ చేసినట్టు జెడ్పీ సీఈవో పోలినాయుడు ప్రకటించారు. మంగళవారం జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి అధ్యక్షతన జరిగింది. పనుల జాప్యంపై గత సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేయగా పూర్తి స్థాయిలో విచారణ చేసి ఎంపీడీవోలకు చార్జ్‌మెమోలు జారీ చేశామని సీఈవో తెలిపారు. మండల అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ) నుంచి సహకారం లేకపోవడం వల్ల పనుల ప్రతిపాదనలు ముందుకు నడవడం లేదని ఎంపీడీవోలు చెబుతున్నారని, ఇదే విషయం లిఖిత పూర్వకంగా ఇస్తే సంబంధిత ఏఈలపై చర్యలు తీసుకుంటామని సీఈవో ప్రకటించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు చేసిన కొద్ది రోజుల్లో బిల్లులు అందజేయడం జరుగుతుందని, దీనిపై ఎవరికి ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. మంత్రి బూడి ముత్యాలనాయుడు ఊరులో రోడ్డు, వంతెనకు ప్రతిపాదనలు ఇవ్వని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులపై సీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు**

జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని జెడ్పీ ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి అన్నారు. సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందరికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై జిల్లా అధికారులతో చర్చించారు. మహిళల ఆర్థిక పురోగతికి కృషి చేయాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని, గరిష్ట దినసరి వేతనం అందేలా తగిన చర్యలు చేపట్టాలని డ్వామా అధికారులకు ఆదేశించారు. మంచినీటి బోర్లకు విద్యుత్ మోటార్లు పెట్టి అక్రమంగా నీటి చౌర్యం చేస్తున్నట్టు సభ్యులు లేవనెత్తిన అంశంపై వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

- ఎన్టీపీసీ ఏరియాలో లారీలు ఓవర్ లోడుతో యాష్, బొగ్గు రవాణా చేస్తున్నాయని, దీని వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు కోరారు. ఇక్కడ ఓవర్ లోడు మీద ఉన్న లారీలపై చర్యలు తీసుకున్నామని, జనవరి,ఫిబ్రవరి నెల్లో 22 కేసులు నమోదు చేసి రూ.5 లక్షల 20 వేల జరిమానా విధించామని ట్రాన్స్‌పోర్టు అధికారులు తెలిపారు. డయాగ్నోస్టిక్ సెంటర్లలో వైద్య పరీక్షలకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ధరలు పట్టికను ప్రజలు వీక్షించేలా ఏర్పాటు చేయాలని భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు కోరారు.


మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు



## గీతాంజలి మృతి బాధాకరం

**వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీలక్ష్మి**

కొమ్మాది: వైఎస్సార్ సీపీ పాలనలో తనకు ఇల్లు వచ్చిందని మురిసిపోయిన తెనాలికి చెందిన గీతాంజలి.. టీడీపీ, జనసేన కార్యకర్తల ట్రోలింగ్‌కు మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఓ మహిళగా తాను చాలా బాధపడుతున్నానని, ప్రతిపక్షాల వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసి ప్రతిపక్షాలు ఈర్ష్య, అసూయతో రగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ట్రోల్ చేసే వాడి తోలు తీయండి**

మహిళలపై అసభ్యకరంగా ట్రోల్ చేస్తున్న వాళ్ల తోలు తీయాలని జీవీఎంసీ 7వ వార్డు వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు చేకూరి రజని డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి నివాళులర్పిస్తూ మారికవలసలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన కార్యకర్తల ముప్పేటదాడిని భరించలేక గీతాంజలి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆమె మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

## నేటి నుంచి డయల్ యువర్ కలెక్టర్

మహారాణిపేట: డయల్ యువర్ కలెక్టర్– ఓటరు హెల్ప్‌లైన్ కార్యక్రమాన్ని బుధవారం నుంచి నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రకటన వచ్చే వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఓటు నమోదు, గుర్తింపు కార్డు పొందడం, ఓటరు చిరునామా మార్పు తదితర అంశాలపై ఓటర్లు 0891–2590100కు ఫోన్ చేసి నేరుగా కలెక్టర్‌తో మాట్లాడవచ్చు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

**రెండు బైక్‌లు ఢీకొని విద్యార్థి, లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి**




మృతి చెందిన విజయ్

పెందుర్తి: పెందుర్తి సమీపంలో అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి(బైపాస్)పై మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలివి.. దువ్వాడకు చెందిన తనుబుద్ది విజయ్(19) దువ్వాడలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై దువ్వాడ నుంచి కొత్తవలస వైపు వెళుతున్నాడు. అదే సమయంలో పెందుర్తి మండలం గొరపల్లికి చెందిన కంచిపాటి శ్రీను కొత్తవలస నుంచి ఇంటికి వెళుతున్నాడు. పెందుర్తి సమీపంలోకి వచ్చేసరికి ఇరువురి బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. రోడ్డుపై తుళ్లిపడిన విజయ్ తలకు, శరీరానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. అతడి బైక్‌పై ఉన్న మరో ఇద్దరు చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. మరో బైక్‌పై ఉన్న శ్రీను రోడ్డుపై పడి చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. తలకు హెల్మెట్ ధరించడం వల్ల శ్రీను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్‌ఐ రమేష్ పరిస్థితిని సమీక్షించారు. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**లారీ బోల్తా పడి..**

అనకాపల్లి–ఆనందపురం బైపాస్‌పై మంగళవారం వేకువజామున లారీ బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మరణించాడు. తెలంగాణలోని చౌటుప్పల్‌కు చెందిన నోముల శేఖర్‌రెడ్డి(49) ఆనందపురంలో ఉన్న స్క్రాప్‌ను లారీలో ఎక్కించుకొని హైదరాబాద్‌కు బయలుదేరాడు. పెందుర్తి సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఎక్కించడంతో లారీ బోల్తా పడింది. క్యాబిన్‌లో ఉన్న శేఖర్‌రెడ్డి డివైడర్‌పై పడి అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శేఖర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన లారీ (ఇన్‌సెట్) శేఖర్‌రెడ్డి(ఫైల్)